శిల్పారామం సమీపంలో
మహిళా స్టాల్స్



4లో.

RNI NO :Title-Code :-TELTEL02102

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దినపత్రిక

అనుక్షణం ప్రజలపక్షం...

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పనిచేయుటకు
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా, మండల, కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను.
ఎడిటర్ : బిర్రు కరుణాకర్
Cell: 9701249103

సంపుటి - 1 సంచిక - 169 శుక్రవారం 15 మార్చి 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## కొత్త ఎలక్షన్ కమిషనర్లు



కొత్త ఎలక్షన్ కమిషనర్లు జ్ఞానేష్‌కుమార్, సుఖ్‌భీర్ సింగ్ సంధు
ఎన్నికల కమిషనర్లను నియమించిన ప్రధాని మోదీ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల సెలక్షన్ కమిటీ

2లో.

# విరాళాల్లో సగం బీజేపీకే

- బాండ్ల రూపంలో పార్టీలకు మొత్తంరూ.12,999 కోట్ల విరాళం
- అందులో రూ.6,060 కోట్లు బీజేపీకి.. రూ.1,609 కోట్లు తృణమూల్‌కు
- టాప్-6లో బీజేపీ, తృణమూల్,కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేడీ, డీఎంకే
- అత్యధిక బాండ్లు విరాళమిచ్చిన టాప్-2 కంపెనీల్లో మేఘా ఇంజనీరింగ్
- తమిళనాడుకు చెందిన ఫ్యూచర్ గేమింగ్ రూ.1,368 కోట్లుబీ మేఘా రూ.1,186 కోట్లు
- సుప్రీం ఆదేశాల మేరకు తమ వెబ్‌సైట్లో వెల్లడించిన కేంద్ర ఎన్నికల కమిషన్



**(జర్నలిస్ట్ వార్త):**న్యూఢిల్లీ:
కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎలక్టోరల్ బాండ్ల పథకంతో అధికార బీజేపీకి అత్యధికంగా నిధులు సమకూరినట్లు వెల్లడయ్యింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎవరెవరు ఎంతెంత బాండ్లు కొన్నారు? ఏ పార్టీలకు ఎంతెంత వచ్చింది? అనే వివరాలను ఎన్నికల కమిషన్‌కు తెలియజేసింది. ఈసీ ఈ జాబితాలను తమ వెబ్‌సైట్లో పెట్టి బహిరంగపరచింది.దీని ప్రకారం మొత్తంగా దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకూ ఎన్నికల బాండ్ల రూపంలో రూ.12,999 కోట్ల రూపాయలు బాండ్ల రూపంలో అందాయి. దీన్లో 46.7 శాతం... అంటే దాదాపుగా సగం అధికార బీజేపీ ఖాతాలోకే వచ్చాయి. రూ.6,060 కోట్ల విలువైన బాండ్లు బీజేపీ ఖాతాలోకి రాగా... ఆ తరవాతి స్థానాల్లో రూ.1,609 కోట్లతో తృణమూల్ కాంగ్రెస్, రూ.1,421 కోట్లతో కాంగ్రెస్ పార్టీ, రూ.1,214 కోట్లతో బీఆర్ఎస్, రూ.775 కోట్లతో బిజూ జనతా దళ్, రూ.639 కోట్లతో డీఎంకే వరుసగా నిలిచాయి.
సుప్రీంకోర్టు నిర్దేశించిన గడువు మేరకు గురువారం సాయంత్రం ఈసీ తమ అధికారిక వెబ్‌సైట్‌లో రెండు భాగాలుగా ఈ వివరాలను పొందుపరిచింది. మొదటి భాగంలో బాండ్లు కొనుగోలు చేసినవారి వివరాలు, వాటి విలువ, రెండో భాగంలో ఆయా బాండ్లను నగదుగా మార్చుకున్న పార్టీల వివరాలు తేదీలతో సహా ఉన్నాయి. తమిళనాడుకు చెందిన ఫ్యూచర్ గేమింగ్, హోటల్ సర్వీసెస్ అనే సంస్థ అత్యధిక విలువైన బాండ్లు కొనుగోలు చేసి టాప్-1గా నిలిచింది. కోయంబత్తూరుకు చెందిన ఈ సంస్థ రూ.1,368 కోట్ల విలువైన బాండ్లను కొనుగోలు చేయగా... హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న మెగా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రా సంస్థ రూ.966 కోట్లు, దాని అనుబంధ సంస్థ వెస్టర్న్ యూపీ పవర్ ట్రాన్స్‌మిషన్ కంపెనీ లిమిటెడ్ రూ.220 కోట్లు కలిపి మొత్తం రూ.1,186 కోట్ల విలువైన బాండ్లను కొని రెండో స్థానంలో నిలిచింది.

మిగతా 3లో.

## బీజేపీ నేత జితేందర్ రెడ్డి ఇంటికి వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి... కాంగ్రెస్‌లోకి ఆహ్వానం



**(జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం బీజేపీ సీనియర్ నేత జితేందర్ రెడ్డి నివాసానికి వెళ్లి ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ నుంచి మహబూబ్ నగర్ లోక్ సభ స్థానం ఆశించి జితేందర్ రెడ్డి భంగపడ్డారు. ఈ టిక్కెట్‌ను మాజీ మంత్రి డీకే అరుణకు కేటాయించారు. దీంతో జితేందర్ రెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈ క్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ఆయన నివాసానికి వెళ్లి... కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు.లోక్ సభ ఎన్నికలకు ముందు బీజేపీకి ఆయన షాకిచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్‌లో చేరేందుకు ఆయన కూడా సుముఖంగా ఉన్నట్లుగా ప్రచారం సాగుతోంది.

## గ్రూప్-1 ఉద్యోగ పరీక్షకు దరఖాస్తుల గడువు పొడిగింపు

### దరఖాస్తుకు మరో రెండు రోజుల గడువు ఇచ్చిన టీఎస్‌పీఎస్సీ

**(జర్నలిస్ట్ వార్త):**
గ్రూప్-1 ఉద్యోగ నియామక పరీక్షకు దరఖాస్తుల గడువును తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) పొడిగించింది. అభ్యర్థులకు మరో రెండు రోజుల పాటు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశమిచ్చింది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి గత నెల 19వ తేదీన నోటిఫికేషన్ విడుదలైంది. ఫిబ్రవరి 23వ తేదీ నుంచి ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నారు.బుధవారం వరకు 2.7 లక్షలకు పైగా దరఖాస్తులు అందాయి. షెడ్యూల్ మేరకు గురువారం సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తుకు గడువు ముగిసింది. అయితే దరఖాస్తు గడువును రెండు రోజులు పొడిగిస్తున్నట్లు టీఎస్‌పీఎస్సీ తెలిపింది.
**https://www.tspsc.gov.in**ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

## భారత్ అమోఘం..

### ఐరాస ప్రశంసల జల్లు

**(జర్నలిస్ట్ వార్త):**భారత్‌పై ఐక్యరాజ్యసమితి ప్రశంసల జల్లు కురిపించింది. సగటు ఆయుర్దాయం, తలసరి ఆదాయం విషయంలో అద్భుతమైన పురోగతిని సాధించిందంటూ మెచ్చుకుంది. ఈ మేరకు గురువారం వెలువడిన ఐరాస మానవాభివృద్ధి సూచీ (హెచ్‌డీఐ) భారత్‌ను కొనియాడింది. 2021లో 62.5 ఏళ్లుగా సగటు ఆయుర్దాయం మరుసటి ఏడాది 2022లో 67.7 ఏళ్లకు పెరగడం అమోఘమని రిపోర్ట్ వ్యాఖ్యానించింది. ఇక తలసరి ఆదాయం విషయంలో చక్కటి పురోగతిని సాధించిందని, స్థూల జాతీయ ఆదాయం 12 నెలల వ్యవధిలోనే 6.3 శాతం వృద్ధి చెంది 6951 డాలర్లకు చేరిందని మెచ్చుకుంది. దేశంలో పాఠశాల విద్య కూడా పెరుగుతోందని పేర్కొంది. 0.644 స్కోరుతో 2023/24 మానవాభివృద్ధి సూచీలో 193 దేశాలకుగానూ ఇండియా 134వ స్థానంలో నిలిచిందని వెల్లడించింది. మధ్యస్థ స్థాయి మానవాభివృద్ధి కేటగిరిలో భారత్ నిలిచిందని తెలిపింది.కాగా హెచ్‌డీఐ సూచీలో దేశాల ర్యాంకును నిర్ణయించేందుకు సగటు ఆయుర్దాయం, ఆరోగ్యకరమైన జీవితం, జీవన ప్రమాణాలు, విద్య అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. 1990లో భారత్ హెడ్‌డీఐ స్కోరు 0.434గా ఉండగా 2022 నాటికి 49 శాతం వృద్ధితో 0.64 స్కోరుకు చేరుకుంది.

## రుణాలివ్వడం సామాజిక బాధ్యతగా గర్తించాలి

: బ్యాంకర్లతో మల్లు భట్టివిక్రమార్క
వ్యవసాయం, హౌసింగ్, విద్యా రుణాలను బ్యాంకర్లు ప్రాధాన్యతగా తీసుకోవాలని సూచన
వ్యాపారంలో విఫలమైన ఈము రైతులకు రుణాల చెల్లింపులో వన్ టైం సెటిల్మెంట్ చేయాలని సలహా
బ్యాంకర్లు వ్యాపారాలను ప్రోత్సహించాలన్న భట్టివిక్రమార్క



**(జర్నలిస్ట్ వార్త):**
వ్యవసాయం, హౌసింగ్, విద్యా రుణాలను బ్యాంకర్లు ప్రాధాన్యతగా తీసుకోవాలని... రుణాలివ్వడం సామాజిక బాధ్యతగా గుర్తించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లో ఓ హోటల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రైతులు, నిరుద్యోగులకు రుణాల ఇచ్చే విషయంలో బ్యాంకర్లు ఆస్తులను తప్పనిసరిగా తాకట్టు పెట్టుకోవడం సరైంది కాదన్నారు. వ్యాపారంలో విఫలమైన ఈము రైతులకు రుణాల చెల్లింపులో వన్ టైం సెటిల్మెంట్ చేయాలని సూచించారు. స్వయం సహాయక సంఘాలకు అధిక రుణాలు ఇవ్వాలన్నారు. వచ్చే అయిదేళ్లలో డ్వాక్రా సంఘాల మహిళలకు లక్ష కోట్ల రుణాలు ఇస్తామన్నారు. మహిళలకు ఇచ్చే వడ్డీలేని రుణాల డబ్బులను బ్యాంకర్లకు ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. తెలంగాణ ధనిక రాష్ట్రమని... కాబట్టి బ్యాంకర్లు వ్యాపారాలను ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్రంలో అన్ని రకాల వనరులు అందుబాటులో ఉన్నాయని... ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.

## మల్కాజిగిరిలో నేడు ప్రధాని రోడ్‌షో

### -రేపు నాగర్‌కర్నూల్‌లో బహిరంగ సభ



**(జర్నలిస్ట్ వార్త):**హైదరాబాద్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్ర, శని వారాల్లో రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల మలివిడత ప్రచారంలో పాల్గొననున్నారు.భాజపా విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం మల్కాజిగిరి లోక్‌సభ స్థానం పరిధిలో రోడ్‌షోలో పాల్గొంటారు. మీర్జాలగూడ నుంచి మల్కాజిగిరి క్రాస్ వరకు దాదాపు 1.2 కిలోమీటర్ల మేర సుమారు గంట సేపు ఇది సాగుతుంది. శనివారం నాగర్‌కర్నూల్‌లో బహిరంగ సభ ఉంటుంది. ఇది నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నల్గొండ లోక్‌సభ స్థానాలు లక్ష్యంగా జరగనుంది. అలాగే ఈ నెల 18న మోదీ జగిత్యాల బహిరంగ సభలో పాల్గొంటారు. కరీంనగర్, నిజామాబాద్, పెద్దపల్లి లోక్‌సభ స్థానాలే లక్ష్యంగా దానికి రూపకల్పన చేశారు. ఇప్పటికే ప్రధాని ఈ నెల 4, 5 తేదీల్లో రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల తొలివిడత ప్రచారం నిర్వహించారు. ఆదిలాబాద్, పటాన్‌చెరు విజయ సంకల్ప సభల్లో పాల్గొన్నారు. అలాగే భాజపా అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఒక రోజు హైదరాబాద్‌లో వివిధ కార్యక్రమాల్లో పాల్గొని భాజపా శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ప్రధానమంత్రి మోదీ శుక్రవారం సాయంత్రం 4.50 గంటలకు కేరళ నుంచి ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయం చేరుకుంటారు. రోడ్డు మార్గంలో మల్కాజిగిరికి వెళ్తారు. సాయంత్రం 5.15 గంటల నుంచి 6.15 గంటల వరకు రోడ్‌షోలో పాల్గొంటారు. సాయంత్రం 6.40 గంటలకు రాజ్‌భవన్ చేరుకుంటారు. రాత్రికి అక్కడే బస చేస్తారు. శనివారం ఉదయం 10.45 గంటలకు రాజ్‌భవన్ నుంచి బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. 11 గంటలకు హెలికాప్టర్‌లో బయల్దేరి నాగర్‌కర్నూల్ వెళ్తారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 12.45 వరకు అక్కడ బహిరంగ సభలో పాల్గొంటారు. సభ అనంతరం హెలికాప్టర్‌లో కర్ణాటక రాష్ట్రం కలబురిగి వెళ్తారు.

# అవును.. 50 హార్డ్‌డిస్క్‌లలోని సమాచారాన్ని చెరిపేశాను..

**అంగీకరించిన మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు..**

**ఎస్ఐబీ మాజీ చీఫ్ చుట్టూ బిగుస్తున్న ఉచ్చు!**

**ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రణీత్‌రావు**

**ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకే ఈ పనిచేశానంటూ వాంగ్మూలం**

**తొలిసారి తెరపైకి ప్రభాకర్‌రావు పేరు**

**ప్రణీత్‌రావుకు 14 రోజుల రిమాండ్ విధించిన కోర్టు**



**(జర్నలిస్ట్ వార్త):**
ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక సమాచారాన్ని ధ్వంసం చేసిన కేసులో అరెస్ట్ అయిన మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు సంచలన ఆరోపణలు చేశారు. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకే తాను నడుచుకున్నట్టు చెప్పారు. ఈ కేసులో ప్రభాకర్‌రావు పేరు నిందితుడిగా రికార్డులకెక్కడం ఇదే తొలిసారి.ప్రణీత్‌రావును 20 గంటలపాటు కస్టడీలో ఉంచి ప్రశ్నించిన పోలీసులు గత రాత్రి 8 గంటల సమయంలో న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టగా 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో చంచల్‌గూడ జైలుకు తరలించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలైన తర్వాత సీసీటీవీలు ఆఫ్ చేసి కీలకమైన సమాచారాన్ని కంప్యూటర్ల నుంచి చెరిపివేసి ధ్వంసం చేసినట్టు ప్రణీత్‌రావు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. అయితే, ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకే తానీ పనిచేసినట్టు విచారణలో ఆయన వెల్లడించినట్టు తెలిసింది. "ఎస్ఐబీ కార్యాలయంలోని దాదాపు 50 హార్డ్ డిస్క్‌లలోని డేటాను చెరిపేశాను. వాటి స్థానంలో కొత్తవి పెట్టాను" అని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ప్రణీత్‌రావు వాంగ్మూలం ఇచ్చినట్టు తెలిసింది. మంగళవారం రాత్రి పొద్దుపోయాక రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఆయన ఇంటి నుంచి ప్రణీత్‌రావును పంజాగుట్ట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 20 గంటల విచారణ అనంతరం ఆయనను జడ్జి ఎదుట ప్రవేశపెట్టగా 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్‌కు ఆదేశించారు.

# జమిలి ఎన్నికలపై రాష్ట్రపతికి నివేదిక సమర్పించిన కోవింద్

**(జర్నలిస్ట్ వార్త):**న్యూఢిల్లీ : 'ఒకే దేశం%ొ% ఒకే ఎన్నికలు' పేరిట దేశంలో అన్ని రకాల ఎన్నికలను ఒకేసారి నిర్వహించాలనే ప్రతిపాదనపై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఏర్పాటైన ఉన్నత స్థాయి కమిటీ అధ్యయనం జరిపింది. ఈ నివేదికను గురువారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు సమర్పించింది. ఈ ఉదయం కోవింద్ సహా కమిటీ సభ్యులు రాష్ట్రపతి భవన్‌కు వెళ్లారు. జమిలి ఎన్నికలపై 18,629 పేజీల నివేదికను ప్రథమ పౌరురాలికి అందజేశారు. దేశంలో జమిలి ఎన్నికలు నిర్వహించాలని కమిటీ ఏకగ్రీవంగా తమ అభిప్రాయాన్ని వెల్లడించింది.



### కమిటీ సూచనలు

జమిలి ఎన్నికలకు కోవింద్ కమిటీ రెండంచెల విధానాన్ని సూచించింది. తొలుత, లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలకు ఏకకాలంలో పోలింగ్ నిర్వహించాలని పేర్కొంది. ఆ తర్వాత 100 రోజులకు మున్సిపాలిటీలు, పంచాయతీలకు ఎన్నికలు జరపాలని నివేదికలో తెలిపింది. ఇందుకోసం రాజ్యాంగంలో కనీసం ఐదు ఆర్టికల్స్‌ను సవరించాలని కమిటీ సూచించింది. ఇక, మూడు స్థాయిల ఎన్నికలకు ఉమ్మడిగా ఓటర్ల జాబితా ఉండాలని తెలిపింది. దాదాపు 190 రోజుల పాటు ఈ అంశంపై కమిటీ అధ్యయనం జరిపింది.

పలు రంగాల నిపుణులతో విస్తృత సమావేశాలు నిర్వహించింది. 47 రాజకీయ పార్టీలు దీనిపై తమ అభిప్రాయాలు తెలిపాయి. ఇందులో 32 జమిలికి మద్దతు ఇచ్చాయి. ప్రజల నుంచి కూడా కమిటీ సలహాలు, సూచనలు కోరగా, 21,558 స్పందనలు వచ్చాయి. వీటిలో 80 శాతం మంది ఏకకాల ఎన్నికలను సమర్ధించారు. ఇవన్నీ అధ్యయనం చేసిన అనంతరం కమిటీ నివేదిక రూపొందించింది. ఏకకాల ఎన్నికల నిర్వహణపై గత కొన్నేళ్లుగా బలంగా ప్రచారం చేస్తున్న మోడీ ప్రభుత్వం, 2023 సెప్టెంబరులో దీనిపై కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ ఛైర్మన్‌గా మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను నియమించింది.

కేంద్ర మంత్రి అమిత్‌షా, లోక్‌సభలో విపక్ష నేత అధిర్ రంజన్ చౌదరి, గులాం నబీ ఆజాద్, 15 వ ఆర్థిక సంఘం మాజీ ఛైర్మన్ ఎన్‌కె సింగ్, లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్ సుభాష్ కశ్యప్ , సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే, మాజీ చీఫ్ విజిలెన్స్ కమిషనర్ సంజయ్ కొఠారీలను కమిటీలో సభ్యులుగా చేర్చింది. ప్రత్యేక ఆహ్వానితుడిగా కేంద్ర మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ , కమిటీ సెక్రటరీగా కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి నితిన్ చంద్రలకు బాధ్యతలు అప్పగించింది.

### సిద్ధమవుతున్న లా కమిషన్ నివేదిక

ఒకే దేశం.. ఒకే ఎన్నిక అంశంపై లా కమిషన్ కూడా తమ నివేదికను దాదాపు సిద్ధం చేసినట్టు తెలిసింది. జమిలి ఎన్నికల కోసం రాజ్యాంగంలో ప్రత్యేకంగా ఒక అధ్యాయాన్ని చేర్చాలని లా కమిషన్ సూచించే అవకాశం ఉందని సమాచారం. 2029 నాటికి ఏకకాల ఎన్నికల నిర్వహణ వీలయ్యేలా చేసేందుకు అవసరమైన మార్గసూచీని లా కమిషన్ ప్రభుత్వానికి అందజేయవచ్చని తెలుస్తోంది.

# రేషన్ కార్డులు లేకపోయినా ప్రభుత్వ పథకాలు అందుతాయి

## - మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యాఖ్య**

**కేసీఆర్ డబుల్ బెడ్రూం ఇళ్లు పూర్తి చేయడంలో నిర్లక్ష్యం వహించారని ఆగ్రహం**

**(జర్నలిస్ట్ వార్త):**
రేషన్ కార్డులు లేకపోయినప్పటికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని... ఈ విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం హుజూర్‌నగర్‌లో సీతారామస్వామి గుట్ట సమీపంలో 2160 సింగిల్ బెడ్రూం ప్లాట్ల పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేసి పైలాన్‌ను ప్రారంభించారు. ఈ




కార్యక్రమంలో ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ డబుల్ బెడ్రూం ఇళ్లను పూర్తి చేయడంలో నిర్లక్ష్యం వహించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి నియోజకవర్గంలో ప్రతీ ఏడాది 3,500 ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారు. హుజూర్‌నగర్‌లో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.మరో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... అప్పుల్లో ఉన్న రాష్ట్రాన్ని బయటపడేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కాళేశ్వరంలో చేసిన తప్పుడు విధానాలతో ప్రస్తుతం నీళ్లు ఉన్నప్పటికీ వాడుకోలేని పరిస్థితి ఉందన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వ తప్పులను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ధరణి ద్వారా చేసిన ల్యాండ్ మాఫియాను ప్రజల ముందుకు తీసుకు వస్తామన్నారు. భద్రాద్రి, యాదాద్రి పేర్లను దోచుకోవడానికి ఉపయోగించుకున్నారని ఆరోపించారు.

# కొత్త ఎలక్షన్ కమిషనర్లు

**(జర్నలిస్ట్ వార్త):**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల సెలక్షన్ కమిటీ ఇద్దరు కొత్త ఎన్నికల కమిషనర్లను నియమించింది. కేంద్ర ఎన్నికల కమిషనర్లుగా కేరళకు చెందిన మాజీ ఐఏఎస్ అధికారి జ్ఞానేష్‌కుమార్, పంజాబ్‌కు చెందిన రిటైర్డ్ ఐఏఎస్ సుఖ్‌భీర్ సింగ్ సంధులను ఎంపిక చేసింది. ఈ విషయాన్ని కమిటీ సభ్యులలో ఒకరయిన కాంగ్రెస్ లీడర్ అధిర్ రంజన్ చౌదరీ మీడియాతో వెల్లడించారు. ఇక లోక్ సభ ఎన్నికల ముందు ఇటీవల అరుణ్ గోయల్ తన ఎలక్షన్ కమిషనర్ పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో అలా అరుణ్ గోయల్ తప్పుకున్న రోజుల వ్యవధిలోనే ఈ కొత్త నియమకాలు జరగడం గమనార్హం.
అలాగే ఎన్నికల కమిషనర్ల నియామకాల కోసం ఏర్పడిన సెలక్షన్ కమిటీ ఏర్పాటు తర్వాత జరిగిన మొదటి నియామకాలు కూడా ఇవే. లోక్ సభ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించడానికి ఇంక కొన్ని రోజులే ఉందనగా ఎలక్షన్ కమిషర్ అనుప్ పాండే ఈ ఏడాది ఫిబ్రవరిలో పదవీవిరమణ చేశారు. అటు అరుణ్ గోయల్ తన ఎలక్షన్ కమిషనర్ పదవికి రాజీనామా చేశారు. దీంతో ముగ్గురు సభ్యులు ఉండే కేంద్ర ఎన్నికల సంఘంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ఒక్కరే మిగిలారు. దీంతో తాజాగా ఇద్దరు కమిషనర్లను సెలక్షన్ కమిటీ నియమించింది.
కాగా, ఈ సెలక్షన్ కమిటీలో ప్రధానమంత్రితో పాటు కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా, లోక్ సభలో కాంగ్రెస్ నాయకుడు అధిర్ రంజన్ చౌదరి కూడా ఉన్నారు. గురువారం ప్రధాని మోదీ అధ్యక్షతన ఎలక్షన్ కమిషన్ భేటీ అయింది. అనంతరం న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, హెూంశాఖ కార్యదర్శి, శిక్షణ వ్యవహారాలశాఖ కార్యదర్శి సభ్యులుగా ఉన్న సెర్చ్ కమిటీ ప్రతిపాదించిన పేర్ల జాబితాపై చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇక చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ వచ్చే ఏడాది ఫిబ్రవరిలో పదవీ విరమణ చేయనున్నారు.

# బెంగళూరు పరిస్థితి హైదరాబాద్ కు రావొద్దు

## అధికారులను హెచ్చరించిన హైకోర్టు

**(జర్నలిస్ట్ వార్త):**



నీటి కరవుతో అల్లాడుతున్న బెంగళూరు పరిస్థితి హైదరాబాద్ కు రానివ్వొద్దని అధికారులకు తెలంగాణ హైకోర్టు సూచించింది. ముందే జాగ్రత్త పడాలని, నీటి లభ్యత, వినియోగం మధ్య తేడాను ఎప్పటికప్పుడు బేరీజు వేసుకుంటూ అవసరమైన చర్యలు చేపట్టాలని పేర్కొంది. ఈ విషయంలో నిర్లక్ష్యంగా ఉంటే ప్రస్తుతం బెంగళూరు వాసులు ఎదుర్కొంటున్న పరిస్థితి రేపు హైదరాబాదీలకు ఎదురవుతుందని హెచ్చరించారు. బెంగళూరు పరిస్థితి చూసైనా జాగ్రత్త పడాలని హితవు పలికింది. ఈమేరకు జంట నగరాలలో నీటి ఎద్దడి పెరిగిపోయిందని హైదరాబాద్ కు చెందిన పీఆర్ సుభాష్ చంద్రన్ అనే వ్యక్తి 2005లో రాసిన లేఖను పిటిషన్ గా స్వీకరించిన హైకోర్టు.. దీనిపై బుధవారం విచారణ చేపట్టింది.ఈ విషయంపై ప్రభుత్వ లాయర్ కోర్టుకు వివరణ ఇచ్చారు. 2005 నాటి పరిస్థితులు ఇప్పుడు లేవని, ప్రస్తుతం జంట నగరాలకు సరిపడా తాగునీటిని అందిస్తున్నామని చెప్పారు. ఈ వివరణపై సీజే జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్ కుమార్ తో కూడిన డివిజన్ బెంచ్ అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇది ప్రజల నిత్యావసరమని, ప్రభుత్వ వ్యతిరేక విషయం అనుకోవద్దని చెప్పింది. నీటి కొరతకు సంబంధించి గతంలో జారీ చేసిన ఉత్తర్వులకు సంబంధించి తీసుకున్న చర్యలతో రిపోర్టు ఇవ్వాలంటూ ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ.. పిటిషన్ విచారణను బెంచ్ శనివారానికి వాయిదా వేసింది.

# మరో రెండు స్థానాలకు ఎంపీ అభ్యర్థులను ప్రకటించిన కేసీఆర్

## మల్కాజ్‌గిరి రాగిడి లక్ష్మారెడ్డి ఆదిలాబాద్ స్థానానికి ఆత్రం సక్కు

**(జర్నలిస్ట్ వార్త):**


రానున్న లోక్ సభ ఎన్నికల కోసం బీఆర్ఎస్ మరో రెండు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. మల్కాజ్‌గిరి లోక్ సభ స్థానానికి పార్టీ అభ్యర్థిగా రాగిడి లక్ష్మారెడ్డిని, ఆదిలాబాద్ లోక్ సభ స్థానానికి ఆత్రం సక్కును ఖరారు చేశారు. ఈ మేరకు పార్టీ అధినేత కేసీఆర్ వీరిద్దరి పేర్లను ప్రకటించారు. ఉదయం ఆదిలాబాద్ లోక్ సభ నియోజకవర్గం ముఖ్య నేతలతో అధినేత సమావేశమయ్యారు. ఈ సాయంకాలం అభ్యర్థిని ప్రకటించారు.2019 లోక్ సభ ఎన్నికల్లో పార్టీ నుంచి నగేశ్ పోటీ చేసి గెలిచారు. అయితే ఈసారి టిక్కెట్ ఆత్రం సక్కుకు ఇస్తామని కేసీఆర్ గతంలోనే హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో నగేశ్ బీజేపీలో చేరి టిక్కెట్ దక్కించుకున్నారు. దీంతో ఆత్రం సక్కుకు మార్గం మరింత క్లియర్ అయింది. మల్కాజ్‌గిరి నియోజకవర్గం నుంచి బీజేపీ తరపున మాజీ మంత్రి ఈటల రాజేందర్ పోటీ చేస్తున్నారు.

# ఎన్నికల వేళ దేశ ప్రజలకు స్వల్ప ఊరట... పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించిన కేంద్రం

## లీటర్ పెట్రోల్ పై రూ.2... డీజిల్ పై రూ.2 తగ్గింపు

## శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి కొత్త ధరల అమలు

**(జర్నలిస్ట్ వార్త):**



దేశంలో చమురు ధరలు తగ్గించాలన్న డిమాండ్లు ఎప్పటినుంచో ఉన్నాయి. అయితే, మరి కొన్ని వారాల్లో ఎన్నికలు జరగనున్న దశలో, కేంద్రం నేడు పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించింది. లీటర్ పెట్రోల్ పై రూ.2, డీజిల్ పై రూ.2 తగ్గిస్తున్నట్టు కేంద్ర చమురు శాఖ వెల్లడించింది. తగ్గించిన ధరలు రేపు ఉదయం 6 గంటల నుంచి వర్తిస్తాయని తెలిపింది. కాగా, ధరల తగ్గింపుపై చమురు మార్కెటింగ్ సంస్థలు ఇప్పటికే సమాచారం అందించాయని కేంద్ర పెట్రోలియం శాఖ పేర్కొంది. ధరలు తగ్గించిన నేపథ్యంలో, దేశ రాజధాని ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ఇకపై రూ.94.72... లీటర్ డీజిల్ 87.62కు లభించనున్నాయి.

# తెలంగాణాలో పలువురు అధికారుల బదిలీ..



**(జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ ప్రభుత్వం పలువురు అధికారులను బదిలీ చేసింది. తాజాగా ప్రణాళిక శాఖ సంయుక్త కార్యదర్శిగా సీహెచ్ శివలింగయ్య, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్‌గా అశ్విని తాజీ వాకడేను నియమించారు.అలాగే విద్య, మౌలిక సదుపాయాల వీసీ, ఎండీగా మల్లయ్య భట్టును ప్రభుత్వం నియమించింది. సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా మల్లయ్య భట్టుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

# నేడు అంగడి బహిరంగ వేలం

**రాయపర్తి, మార్చి14(జర్నలిస్ట్ వార్త):** మండల కేంద్రంలోని పశువుల సంత (అంగడి) గ్రామ పంచాయతీ ఆవరణంలో నేడు బహిరంగ వేలం వేస్తున్నట్లు గురువారం గ్రామపంచాయతీ ఆవరణంలో బహిరంగ అంగడి వేలం పాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి గుగులోత్ అశోక్ ఓ ప్రకటనలో తెలిపారు. 2024 - 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వేలం నేడు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సంత కొనుగోలు చేయాలనుకునే ఆసక్తి కలవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# నిరుద్యోగ యువత మెగాజాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

### - వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



వరంగల్, మార్చి14(జర్నలిస్ట్ వార్త): వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిరుద్యోగ యువత జాబ్‌మెళాను సద్వినియోగం చేసుకోవాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా యువతకు పిలుపునిచ్చారు. గురువారం వరంగల్ కమిషనరేట్ పోలీసుల అధ్వర్యంలో టి.యం.ఐ ఫౌండేషన్ ట్రస్ట్ వారి సహకారంతో మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈనెల 16వ తేదీ శనివారం రోజున హనుమకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాలలో ఉదయం 10 గంటల నుండి నిర్వహింబడే ఈ మెగా జాబ్ మేళాలో సూమారు 3 వేలకు పైగా వివిధ ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ నియామకాలను చేపట్టడం జరగుతుందని తెలిపారు. ఈ జాబ్ మేళాలో పాల్గొనే యువత కనీసం పదవ తరగతి పాసై వుండాలన్నారు. ఇందులో పాల్గోనే యువత ముందుగా **bit.ly/jmform** వెబ్ సైట్ ద్వారా తమ వ్యక్తిగత వివరాలను నమోదు చేసుకోవాల్సి వుంటుందని పేర్కొన్నారు. వరంగల్ కమిషనరేట్ పోలీసుల ద్వారా అందిస్తున్న ఈ సదావకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# భూగర్భగనులలో పైకప్పు ప్రమాదాలను ముందుగా గుర్తించే టెక్నాలజీ

### ప్రయోగాత్మకంగా ఒక గనిలో ఏర్పాటుకు పరిశీలన
### సింగరేణి సిఎండి బలరామ్‌కు వివరించిన ఆస్ట్రేలియా బృందం



**(జర్నలిస్ట్ వార్త):** హైదరాబాద్: భూగర్భ గనులను నూరు శాతం ప్రమాదరహిత గనులుగా రూపొందించడం కోసం సింగరేణి యాజమాన్యం అంతర్జాతీయస్థాయిలో అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతికతను పరిశీలిస్తోందని, మేలైన సాంకేతికతను వినియోగించడానికి సింగరేణి సిద్ధంగా ఉందని సిఎండి ఎన్.బలరామ్ పేర్కొన్నారు. భూగర్భ గనులలో పైకప్పుకూలి జరిగే ప్రమాదాలను నివారించడం కోసం ఆస్ట్రేలియా దేశానికి చెందిన నోమ్ అనే సంస్థ కొత్తగా రూపొందించిన ఆధునిక పరికరాల పనితీరును గురువారం హైదరాబాద్ సింగరేణి భవన్ లో పరిశీలించిన తరువాత పై ఆయన ఉన్నత స్థాయి అధికారులతో చర్చించారు .భూగర్భగనులలో రక్షణ చర్యలు ఎన్నో తీసుకున్నప్పటికీ అకస్మాత్తుగా పైకప్పు కూలి కార్మికులు మృతిచెందిన సంఘటనలు గతంలో అనేకం జరిగాయి. కాగా ఆస్ట్రేలియాకి చెందిన ప్రముఖ పరిశోధన సంస్థ నోమ్ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పై కప్పు ప్రమాదాలు జరగకముందే ముందస్తు హెచ్చరికలు జారీ చేసే ఒక యంత్ర విభాగాన్ని రూపొందించారు. దీనివలన పైకప్పు ప్రమాదం జరగకముందే గనిలోని కార్మికులను అధికారులు హెచ్చరిస్తూ ఫ్లాష్ లైటింగ్ ద్వారా కానీ సైరన్ ద్వారా గాని ఇది అప్రమత్తం చేస్తుంది. దీనివలన ప్రమాదాన్ని నివారించడం కోసం అన్ని రకాల చర్యలు తీసుకొని, ప్రాణ నష్టం జరగకుండా చూసే అవకాశం ఏర్పడుతుంది. ఈ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సింగరేణి సంస్థలో కూడా వినియోగించాలని కోరుతూ ఆస్ట్రేలియాకి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నాథన్ ఓవెన్, జనరల్ మేనేజర్ కేసన్ ఫిన్ లెన్ సంస్థ చైర్మన్ మరియు ఎండి ఎన్ బలరాం, డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్ జి వెంకటేశ్వర్ రెడ్డి, జనరల్ మేనేజర్ (ఆర్ అండ్ డి ) ఎస్డిఎం సుభానికి డెమో స్టేషన్ ద్వారా వివరించారు. దీనిపై డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్ జి వెంకటేశ్వర్ రెడ్డి వివరిస్తూ ప్రమాదాల నివారణకు ఇప్పటికే సింగరేణి సంస్థ అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తుందని, భూగర్భంలో పైకప్పు కిందికి జారడం పైన ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసే ఈ కొత్త సాంకేతికత వల్ల ప్రమాదాలను నూరు శాతం అరికట్టే అవకాశం ఉందన్నారు. జనరల్ మేనేజర్ (ఆర్ అండ్ డి ) ఎస్.డి.ఎం సుభాని మాట్లాడుతూఆస్ట్రేలియా బృందం వారు ఇచ్చిన డెమోనిస్ట్రేషన్ ను పరిశీలించామని, దీనిపై ఉన్నత స్థాయిలో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని వివరించారు.

# దాడికి గురైన రైతును పరామర్శించిన దళిత ప్రజా సంఘాల నాయకులు




పర్వతగిరి, మార్చి14(జర్నలిస్ట్ వార్త): పర్వతగిరి మండలం కల్లెడ గ్రామానికి చెందిన బొంపెల్లి చెన్నారావు అనే రైతు ఇటీవల దాడికి గురైనారు. గురువారం సమాచారం తెలుసుకున్న ప్రజాసంఘాల నాయకులు కాజీపేటలోని చెన్నారావు సమీప బంధువు ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను పరామర్శించారు. అనంతరం దాడికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. రైతు చెన్నారావుపై దాడి చేయడం అప్రజాస్వామ్యమని అన్నారు. దాడి చేసిన వ్యక్తులపై ప్రభుత్వ యంత్రాంగం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ పరామర్శలో తెలంగాణ అంబేద్కర్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య, ఆర్.ఎస్.పి వరంగల్ జిల్లా కార్యదర్శి వలందాస్ కుమార్, రైతు సంఘం వరంగల్ జిల్లా కన్వీనర్ అన్నమనేని వెంకటేశ్వర్ రావు, రైతు సంఘం జిల్లా నాయకులు సూరినేని విజయ్ కుమార్ రావు తదితరులు ఉన్నారు.


# విరాళాల్లో సగం బీజేపీకే




**(మొదటి పేజీ తరువాయి)**
రూ.వెయ్యి కోట్లను దాటి బాండ్లు కొనుగోలు చేసిన కంపెనీలు ఈ రెండే కాగా... వందల కోట్ల మేర భారీగా బాండ్లు కొనుగోలు చేసిన కంపెనీల జాబితాలో గ్రాసిమ్ ఇండస్ట్రీస్, పిరమల్ ఎంటర్‌ప్రైజెస్, టోరెంట్ పవర్, మహీంద్రా అండ్ మహీంద్రా, భారతీ ఎయిర్‌టెల్, డీఎల్‌ఎఫ్ కమర్షియల్ డెవలపర్స్, ఎక్సెల్ మైనింగ్, వేదాంత లిమిటెడ్, అపోలో టైర్స్, లక్ష్మీ నివాస్ మిట్టల్, పీవీఆర్, సూలా వైన్స్, వెల్‌స్పన్, సన్ ఫార్మా తదితర ప్రఖ్యాత సంస్థలున్నాయి. తెలుగు రాష్ట్రాలకు చెందిన యశోద హాస్పిటల్స్, నవయుగ ఇంజినీరింగ్, దివీస్ ల్యా'రేటరీస్, ఎన్‌సీసీ, నాట్కో ఫార్మా, అరబిందో ఫార్మా కూడా బాండ్లు కొనుగోలు చేసిన సంస్థల్లో ఉన్నాయి. ఎలక్టోరల్ బాండ్ల పథకం 2018లో అమల్లోకి వచ్చింది. వ్యక్తులు, వ్యాపార/వాణిజ్య సంస్థలు ఈ బాండ్లను కొనుగోలు చేసి, రాజకీయ పార్టీలకు అందజేశాయి. 2019 ఏప్రిల్ 1 నుంచి 2024 ఫిబ్రవరి 15వ తేదీ దాకా జారీ చేసిన బాండ్ల వివరాలను సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో ఎస్‌బీఐ వెల్లడించిన సంగతి తెలిసిందే.

# టెట్ నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

**డీఎస్సీ కంటే ముందే నిర్వహించుకునే విధంగా జీవో ఇచ్చిన ప్రజా ప్రభుత్వం దీంతో 3 లక్షల మంది నిరుద్యోగులకు మేలు**




**(జర్నలిస్ట్ వార్త):**
ఉపాధ్యాయ అర్హత పరీక్ష-%ుజు% నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. డీఎస్సీకి ముందే టెట్‌ను నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు విద్యాశాఖ కమిషనర్‌కు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో త్వరలో టెట్ నోటిఫికేషన్ ను ఉన్నత విద్యాశాఖ జారీ చేయనుంది. సాధ్యమైనంత ఎక్కువమందికి డీఎస్సీ రాసే అవకాశం కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.తెలంగాణలో ఇప్పటికే మెగా డీఎస్సీ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. మార్చి 4 నుంచి ఏప్రిల్ 2 వరకు ఆన్ లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ప్రజా ప్రభుత్వం నిరుద్యోగుల పక్షాన ఉంటుందనడానికి ఇదే నిదర్శనమని కాంగ్రెస్ పేర్కొంది. ప్రజలు, నిరుద్యోగుల ఆలోచనలను కాంగ్రెస్ ప్రభుత్వం వింటోందని మరోసారి రుజువైందని ట్వీట్ చేసింది.

# టిఎల్‌ఎం మేళాతో సులభతర బోధన




రాయపర్తి, మార్చి14(జర్నలిస్ట్ వార్త): టిఎల్‌ఎం మేలతో విద్యార్థులకు సులభతరమైన బోధన లభిస్తుందని ప్రధానోపాధ్యాయులు గారె కృష్ణమూర్తి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో టిఎల్‌ఎం మేళాను నిర్వహించారు. ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులు తయారు చేసినటువంటి టిఎల్‌ఎం ఎగ్జిబిట్లు తెలుగు, ఆంగ్లము, గణితము, ఈవీఎస్ సబ్జెక్టుల యందు ఒక్కొక్క పాఠశాల నుండి 8 తీసుకొని రావడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిఎల్‌ఎం మేల ద్వారా విద్యార్థులకు సులభతరంగా బోధన చేయడానికి, విద్యార్థులకు మనసుకు ఆకట్టుకునే విధంగా ప్రయోగాత్మకంగా విద్యార్థులకు బోధించి, అర్థం అయ్యే విధంగా చేయడం కొరకు ఉపయోగపడతాయని అన్నారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, గోవర్ధన్, రాజయ్య, ప్రవీణ్ రెడ్డి, రోజారాణి, రోహిణి దేవి, మమత, సిఆర్పి స్వర్ణలత, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్ కు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రాజీనామా..



**(జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ రాష్ట్రంలో మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి బీఆర్‌ఎస్ పార్టీకి షాకిచ్చారు. ఈ రోజు ఆయన రాజీనామా చేసి ఆ లేఖను గులాబీ దళపతి కేసీఆర్‌కు పంపారు. రెండు దశాబ్దాల కాలంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మంత్రిగా, శాసనసభ్యుడిగా తనదైన శైలిలో రాజకీయం చేసిన పెద్దిరెడ్డి హఠాత్తుగా రాజీనామా చేయడం కలకలం రేపింది. పార్లమెంట్ ఎన్నికలకు ముందు పెద్దిరెడ్డి రాజీనామా చేయడం బీఆర్‌ఎస్ పార్టీకి పెద్ద షాక్ తగిలినట్టయింది. రాజీనామా అనంతరం పెద్దిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ%ఞా% తాను టీఆర్‌ఎస్ పార్టీలో చేరడం పెద్ద తప్పిదమని, ఉమ్మడి జిల్లాలో మంత్రిగా పనిచేసిన తనకు కేసీఆర్ ఏనాడు ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. సోమవారం కరీంనగర్ లో జరిగిన సమావేశంలో కేసీఆర్ తనకు ప్రాధాన్యత ఇవ్వలేకపోవడం మనసు కలచివేసిందని, అంతకు ముందు తాను బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపునకు ఎంతో కృషి చేశారని తెలిపారు. హుజరాబాద్‌లో కౌశిక్ రెడ్డి గెలుపునకు తన వంతు పాత్ర పోషించానని అయినా కేసీఆర్ తనకు ప్రాధాన్యత ఇవ్వలేదని, దీంతో మనసు చెదిరి పార్టీకి రాజీనామా చేసినట్లు చెప్పారు. భవిష్యత్తు కార్యాచరణపై తాను కార్యకర్తలతో, అభిమానులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటానని తెలిపారు

# బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి పరామర్శ



**రాయపర్తి, మార్చి14(జర్నలిస్ట్ వార్త):** రాయపర్తి మండల పరిధిలోని బాధిత కుటుంబాలను గురువారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రమర్శించారు. ఆరెగూడెం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు ఇటికాల భాను ప్రకాష్, పెరికేడు గ్రామానికి చెందిన బిఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నన్నెబోయిన వెంకటయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రి వారి కుటుంబాలను సందర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జిల్లా నాయకులు బిల్లా సుధీర్ రెడ్డి, చిన్నాల రాజబాబు, బండి రాజబాబు, యూత్ నాయకులు సంకినేని ఎల్లస్వామి తదితరులు ఉన్నారు.

# యాదాద్రి ఆలయ ఈవో రామకృష్ణ పై బదిలీ వేటు



**(జర్నలిస్ట్ వార్త):**యాదాద్రి ఆలయ ఈవో రామకృష్ణ రావుపై ప్రభుత్వం బదిలీ వేటువేసింది. సీఎం రేవంత్ రెడ్డి పర్యటనలో ఆలయ ఈవో రామకృష్ణ ప్రొటోకాల్ పాటించలేదన్న ఆరోపణలతో దేవాదాయ ధర్మాదాయ శాఖ బదిలీ చేసింది..డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పట్ల అమర్యాదగా వ్యవహరించడంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చే సమయంలో మిగతా మంత్రుల కంటే కాస్త తక్కువ ఎత్తున్న స్టూల్‌పై డిప్యూటీ సీఎంను కూర్చోబెట్టారు. దీంతో ఉపముఖ్యమంత్రికి అవమానం అంటూ పెద్ద ఎత్తున దుమారం రేపింది. ఇదే అంశంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సైతం స్పందించారు.అవమానం లాంటిది ఏమీ లేదని%ొ% తానే కింద కూర్చున్నానని చెప్పుకొచ్చారు. అయినా నష్ట నివారణ చర్యల్లో భాగంగా ఆలయ ఈవోపై చర్యలు తీసుకున్నారు. యాదాద్రి ఈవోగా భాస్కర్ రావును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు

# నీళ్ల సమస్య ఊర్లలో రావద్దు :మంత్రి పొన్నం



**(జర్నలిస్ట్ వార్త):**
ఊర్లలో నీళ్ల సమస్య రావద్దని అధికారులను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. జిల్లా అభివృద్ధికి తోడ్పడతానని తెలిపారు. వేసవి కాలంలో నీటి ఎద్దడి లేకుండా చేస్తామని అన్నారు.వర్షాలు పడక కరువు వస్తే కాంగ్రెస్ కరువు తెచ్చిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు.బిందె పట్టుకుని బయటకు వచ్చే సమస్య రావద్దని సూచించారు. నీళ్ల సమస్య రాకుండా నియోజకవర్గానికి 3.5 కోట్లు తీసుకొచ్చామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ఎలాంటి ఇబ్బందులున్న తనకు చెప్పవచ్చని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు.
పాఠశాలల్లో కిచెన్, టాయిలెట్స్ పూర్తి చేయాలని సూచించారు. విద్యకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. గత ప్రభుత్వం లాగా కేంద్రంతో కొట్లాడే వాళ్ళం కాదని వాళ్ల దగ్గర నిధులు తీసుకొస్తామని చెప్పారు. ఫెడరల్ సిస్టంలో రాష్ట్రానికి కేంద్రం సహకరించాల్సిందే అని తెలిపారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్లు ,500 కే గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని చెప్పారు. 16 కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేశామన్నారు.

# శిల్పారామం సమీపంలో మహిళా స్టాల్స్



**(జర్నలిస్ట్ వార్త)**హైదరాబాద్ : మహిళా శక్తి పథకంలో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళల ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన శిల్పారామం పక్కన నిరుపయోగంగా ఉన్న స్టాల్స్ ను పరిశీలించారు. 2017 నుంచి నిరుపయోగంగా ఉన్న నైట్ బజార్ లోని 119 స్టాల్స్ ను ఇందుకు ఉపయోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. రైతు బజార్ లా స్వయం సహాయక మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేలా స్టాల్స్ ను తీర్చి దిద్దాలని అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.పూర్తిగా మహిళలకు మాత్రమే స్టాల్స్ ను కేటాయించాలని రేవంత్ రెడ్డి కోరారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలతో ఉత్తర్వులను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వీలైనంత త్వరగా ఉత్తర్వులను జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని ఆదేశించారు. అవసరమైతే మణిపూర్ లోని మహిళలకు కేటాయించిన మార్కెట్ ను అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. మహిళా శక్తి పథకంలో భాగంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి అన్నారు

# 411 స్థానాల్లో ఎన్డీయే కూటమి గెలుపు

## న్యూస్18 మెగా ఒపీనియన్ పోల్ సర్వే వెల్లడి..

**తెలుగు రాష్ట్రాల్లో 42 లోక్ సభ స్థానాలకు గాను 25 సీట్లు గెలుచుకోనున్న ఎన్డీయే**

**ఉత్తర ప్రదేశ్‌లో 80 లోక్ సభ స్థానాలకు 77 చోట్ల విజయం వరిస్తుందన్న సర్వే**

**గుజరాత్, రాజస్థాన్, ఢిల్లీ సహా పలు రాష్ట్రాల్లో బీజేపీ క్లీన్ స్వీప్ చేయనుందని విశ్లేషించిన సర్వే**

**(జర్నలిస్ట్ వార్త):**
రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి 400కు పైగా లోక్ సభ సీట్లను గెలిచి అద్భుత విజయం సాధించే అవకాశం ఉందని న్యూస్18 మెగా ఒపీనియన్ పోల్ సర్వే తెలిపింది. 543 సీట్లకు గాను బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి 411 సీట్లు గెలుచుకోవచ్చునని, కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ఇండియా కూటమి 105 సీట్లు గెలుచుకోవచ్చునని, ఇతరులు 27 సీట్లు గెలుచుకోవచ్చునని సర్వే విశ్లేషించింది. స్వతంత్ర భారతదేశంలో కాంగ్రెస్ పార్టీకి 1985లో 426 సీట్లు వచ్చాయి. ఆ తర్వాత ఇప్పుడు ఎన్డీయే 400 మార్కును దాటవచ్చునని ఈ సర్వే వెల్లడించింది. బీజేపీ సొంతగా 350 సీట్లు గెలుచుకోవచ్చునని.. మిత్రపక్షాలతో కలిసి 61 గెలుచుకోవచ్చునని తెలిపింది. కాంగ్రెస్ కేవలం 49 సీట్లకే పరిమితం కానుందని ఈ సర్వే వెల్లడించింది.




ఇండియా కూటమిలోని ఇతర మిత్రపక్షాలు 56 సీట్లు గెలుచుకోవచ్చునని తెలిపింది.

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమిలోని బీజేపీ, టీడీపీ, జనసేనకు 18 సీట్లు, వైసీపీకి 7 సీట్లు రావొచ్చునని ఈ సర్వే అంచనా వేసింది. తెలంగాణలో 17 లోక్ సభ స్థానాలకు గాను బీజేపీ 8, కాంగ్రెస్ 6, బీఆర్ఎస్ 2, మజ్లిస్ 1 సీటు గెలిచే అవకాశముందని తెలిపింది. ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీ, కర్ణాటక, అసోం, రాజస్థాన్, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్, ఝూర?ండ్, గుజరాత్, మహారాష్ట్రలలో బీజేపీ క్లీన్ స్వీప్ చేసే అవకాశముందని తెలిపింది. తమిళనాడు, కేరళలో తక్కువ సీట్లు గెలుచుకున్నప్పటికీ మంచి ప్రదర్శన కనబరుస్తుందని సర్వే పేర్కొంది. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ కంటే ఎక్కువ సీట్లు గెలుచుకోనుందని సర్వే విశ్లేషించింది.

# సిఎఎను అడ్డుకునే అధికారం రాష్ట్రాలకు లేదు

## కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టీకరణ

**(జర్నలిస్ట్ వార్త):న్యూఢిల్లీ:** పౌరసత్వ సవరణ చట్టాన్ని(సిఎఎ) వెనుకకు తీసుకునే ప్రసక్తి లేదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. సిఎఎని రాష్ట్రాలు అడ్డుకోలేవని, పౌరసత్వాన్ని కేవలం కేంద్ర ప్రభుత్వమే అనుమతించగలదని కూడా ఆయన తెలిపారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సిఎఎపై ఒక ఆంగ్ల వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అమిత్ షా అనేక సందేహాలను నివృత్తి చేసేందుకు ప్రయత్నించారు. సిఎఎ పరిధిలోకి పార్శీలు, క్రైస్తవులు వస్తారు కాని ముస్లింలు ఎందుకు అర్హులు కారన్న జఠిలమైన ప్రశ్నకు అమిత్ షా ఎదుర్కొన్నారు. 2014 అక్టోబర్ 31 కన్నాముందు భారత్‌లోకి ప్రవేశించిన పాకిస్తాన్, అఫ్ఘానిస్తాన్, బంగ్లాదేశ్‌లోని మైనారిటీలకు సిఎఎ పౌరసత్వం కల్పించనున్నది. భారత్‌లో జన్మించని పార్శీలు, క్రైస్తవ మతానికి చెందిన శరణార్థుల కు భారత పౌరసత్వం కల్పిస్తున్న సిఎఎ ముస్లింత్మాత్రం ఎందుకు కల్పించదన్న ప్రశ్నకు ముస్లిం జనాభా అధికంగా ఉన్న కారణంగా ఇప్పుడు అది(ప్రాంతం) భారత్ భూభాగం కాదని అమిత్ షా అన్నారు. దాన్ని వారికి ఇచ్చే శామని, అఖండ భారత్‌లో భాగమై మత వేధింపులకు గురైన వారికి ఆశ్రయం ఇవ్వడం మన నైతిక, రాజ్యాంగపరమైన బాధ్యతని ఆయన జవాబిచ్చారు. ఈనాటి అఫ్ఘానిస్తాన్, బంగ్లాదేశ్, భూటాన్, భారత్, మాల్దీవులు, మయన్మార్, పాకిస్తాన్, శ్రీలంక, టిబెట్‌లతో కూడిన సమైక్య మహా భారతదేశాన్ని అఖండ భారత్‌గా బిజెపి సంబోధిస్తోంది.దేశ విభజన జరిగిన కాలంలో పాకిస్తాన్ జనాభాలో హిందువులు 23 శాతం ఉన్నారని, ఇప్పుడు అది 3.7 శాతానికి పడిపోయిందని హోం మం త్రి చెప్పారు. వారంతా ఎక్కడకు వెళ్లిపోయారని ఆయన ప్రశ్నించారు. అంతమందైతే మన దేశానికి రాలేదు. బలవంతపు మత మార్పిడులు జరిగాయి. వారిని ఘోరంగా అవమానించి ద్వితీయ శ్రేణి పౌరులుగా పరగణించారు. వారంతా ఎక్కడు వెళతారు..దీనిపై మన పార్లమెంట్, రాజకీయ పార్టీలు నిర్ణయం తీసుకోకూడదా అని ఆయ న ప్రశ్నించారు. 1951లో బంగ్లాదేశ్ జనాభాలో హిందువులు 22 శాతమని, 2011లో ఇది 10 శాతానికి పడిపోయిందని, వారంతా ఎక్కడకు వెళ్లారని ఆయన ప్రశ్నించా రు. 1982లో అఫ్ఘానిస్తాన్‌లో దాదాపు 2



లక్షల మంది సి క్కులు, హిందువులు ఉండేవారని, ఇప్పుడు 500 మంది మాత్రమే మిగిలారని ఆయన చెప్పారు. తమ మత విశ్వాసాలను పాటించే హక్కు వారికి లేదా అని ఆయన నిలదీశారు. భారత్ ఒకటిగా ఉన్నపుడు వా రంతా మన వారేన ని, వారంతా మన సోదరులు, సోదరీమణులు, తల్లులని అమిత్ షా అన్నారు. సిఎఎని ఉపసంహరించే ప్రసక్తి లేదని, మన దేశంలో భారతీయ పౌరసత్వాన్ని ఇవ్వాలన్న నిర్ణయం పార్లమెంట్ తీసుకున్నదని, ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తి లేదని ఆయన స్పష్టం చేశారు.

సిఎఎపై మైనారిటీలు కాని ఇతరులు ఎవరైనా కాని భయపడాల్సిన అవసరం లేదని, ఎవరి పౌరసత్వాన్ని తొలగించే నిబంధన ఏదీ సిఎఎలో లేదని ఆయన తెలిపారు. అఫ్ఘానిస్తాన్, బంగ్లాదేశ్, పాకిస్తాన్‌కు చెందిన హిందూ, బౌద్ధ, జైన, సిక్కు, క్రైస్తవ, పార్శీ శరణార్థులకు హక్కులు, పౌరసత్వాన్ని ఇచ్చేందుకు సిఎఎ ఉందని ఆయన అన్నారు. సిఎఎ ద్వారా కొత్త ఓటు బ్యాంకును బిజెపి సృష్టిస్తోంద న్న ప్రతిపక్షాల ఆరోపణపై స్పందిస్తూ ప్రతిపక్షాలకు వేరే పనేమీ లేదని, చెప్పింది చేసే అలవాటు వారికి లేదని ఆయన విమర్శించారు. రాజ్యాంగంలోని 370వ అధికర ణ రద్దు కూడా రాజకీయ లబ్ధి కోసం చేసిందేనని వారు(ప్రతిపక్షాలు) చెప్పారని, కాని 1950 నుంచి తాము 370వ అధికరణను రద్దు చేస్తామని చెబుతున్నామని అమిత్ షా తెలిపారు. సిఎఎ అమలుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను లోక్‌సభ ఎన్నికలకు ముందే ప్రకటించా ల్సి వచ్చిందన్న ప్రతిపక్షాల ప్రశ్నకు ఆయన స్పందిస్తూ అసదుద్దీన్ ఒవైసీ, రాహుల్ గాంధీ, అరవింద్ కేజ్రీవాల్, మమతా బెనర్జీతోసహా ప్రతిపక్ష పార్టీల నాయకులందరూ అసత్యాల రాజకీయాలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. సిఎఎ అమలును ఉద్దేశపూర్వకంగా ఇప్పుడే చేశామనడం అసత్యమని ఆయన తెలిపారు. సిఎఎని అమలుచేసి అఫ్ఘానిస్తాన్, బంగ్లాదేశ్, పాకిస్తాన్‌కు చెందిన శరణార్థులకు భారతీయ పౌరసత్వాన్ని ఇస్తామని 2019 ఎన్నికల మేనిఫెస్టోలోనే బిజెపి చెప్పిందని ఆయన గుర్తు చేశారు.

2019లో దీన్ని పార్లమెంట్ ఆమోదించిందని, అయితే కొవిడ్ కారణం గా అమలులో జాప్యం జరిగిందని ఆయన వివరించారు. బుజ్జగింపు రాజకీయాలు చేసి తమ ఓటు బ్యాం కును పదిలపరుచుకోవాలని ప్రతిపక్షాలు ఆశిస్తున్నాయన్నారు. వాటి బండారం బయటపడిందని, సిఎఎని ఈ దేశ చట్టంగా ప్రజలు గుర్తించారని తెలిపారు. ఎన్నికల ముందు సిఎఎని అమలు చేస్తామని తాను గ త నాలుగేళ్లలో 41 సార్లు చెప్పానని హోం మంత్రి అన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌పై అమిత్ షా మండిపడ్డారు. కేజ్రీవా ల్ మతిస్థిమితం కోల్పోయారని ఆరోపించారు. శరణార్థులకు పౌరసత్వం ఇస్తే చోరీలు, అత్యాచారాలు పెరిగిపోతాయంటూ కేజ్రీవాల్ చేసిన ప్రకటనను ఆయన తప్పుపట్టారు

# 18 ఓటీటీ ప్లాట్‌ఫామ్స్‌పై కేంద్రం నిషేధం



అసభ్యకరమైన, అశ్లీల కంటెంట్‌ను ప్రోత్సహిస్తున్న 18 ఓటీటీ ప్లాట్‌ఫామ్స్, 19 వెబ్‌సైట్లపై కేంద్ర ప్రభుత్వ వేటువేసింది. నిషేధం విధిస్తున్నట్టుగా కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ గురువారం ప్రకటించింది. వీటితో పాటు మరో 10 యాప్‌లు, 57 సోషల్ మీడియా ఖాతాలను కూడా బ్లాక్ చేస్తున్నట్టు వివరించింది. ఆయా ప్లాట్‌ఫామ్స్ అసభ్యకరమైన కంటెంట్‌తో పాటు కొన్ని సందర్భాల్లో పోర్నోగ్రఫీ కంటెంట్‌ను కూడా పబ్లిష్ చేస్తున్నాయని పేర్కొంది. ఆయా ఓటీటీ ప్లాట్‌ఫామ్స్, వెబ్‌సైట్‌లపై పోస్ట్ చేస్తున్న కంటెంట్ అసభ్యకరంగా, అశ్లీలంగా, స్త్రీలను అవమానపరిచే విధంగా ఉందని గుర్తించామని వెల్లడించింది. ఉపాధ్యాయులు-విద్యార్థుల మధ్య, కుటుంబ సభ్యుల మధ్య అసభ్యకర సంబంధాలను చూపించే కంటెంట్‌ను చిత్రీకరిస్తున్నారని, బూతులు ఎక్కువగా ఉన్నాయని గుర్తించినట్టు కేంద్రం వెల్లడించింది.

కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పలు మంత్రిత్వశాఖలు, విభాగాలు, మీడియా, వినోదరంగం, మహిళలు-పిల్లల హక్కులకు సంబంధించిన నిపుణులతో చర్చించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నామని సమాచార మంత్రిత్వశాఖ వివరించింది. సమాచార సాంకేతిక చట్టం-2000లోని నిబంధనల కింద నిషేధం విధించినట్టు తెలిపింది.

### నిషేధం వేటు పడిన ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ ఇవే..

డ్రీమ్స్ ఫిల్మ్స్, వూవీ, యస్మా, అన్‌కట్ అడ్డా, ట్రై ఫ్లిక్స్, ఎక్స్ ప్రైమ్, నియోన్ ఎక్స్ వీఐపీ, బెషరమ్స్, హంటర్స్, రాబిట్, ఎక్స్‌ట్రామూడ్, న్యూఫ్లిక్స్, మూడ్ ఎక్స్, మోజ్‌ఫ్లిక్స్, హాట్ షాట్స్ వీఐపీ, ఫుగి, చికూఫ్లిక్స్, ప్రైమ్ ప్లే నిషేధం పడిన ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ జాబితాలో ఉన్నాయి.

# తేజ మిరాయ్.. మళ్ళీ ట్విస్టు

హనుమాన్ మూవీ.. బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనం సృష్టించిందో అందరికీ తెలిసిందే. రూ.25 కోట్ల బడ్జెట్ తో తెరకెక్కి రూ.300 కోట్లకుపైగా రాబట్టి లాభాల పంట పండించింది. ఇక ఈ సినిమాతో టాలీవుడ్ యంగ్ హీరో తేజ సజ్జా క్రేజ్ ఓ రేంజ్ లో పెరిగిపోయింది. ఇప్పటికే పలు చిత్రాలతో ఆకట్టుకున్న తేజ.. హనుమాన్ మూవీతో పాన్ ఇండియా స్టార్ అయిపోయారు. అయితే హనుమాన్ మూవీ తర్వాత తేజ సజ్జా కొత్త సినిమాపై టాలీవుడ్ సినీ ప్రియుల్లో మంచి ఆసక్తి నెలకొంది. మరోవైపు, హనుమాన్ తో వచ్చిన క్రేజ్ ను కంటిన్యూ చేయడానికి తేజ కూడా ఆచితూచి అడుగులేస్తున్నారు. ఇక తేజ సజ్జా ప్రస్తుతం మిరాయ్ అనే సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. హనుమాన్ మూవీ రిలీజ్ కు ముందే ఈ ప్రాజెక్ట్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు యంగ్ హీరో. యాక్షన్ ఎంటర్టైనర్ గా తెరకెక్కుతున్న మిరాయ్ సినిమా షూటింగ్ హనుమాన్ చిత్రం రిలీజ్ కు ముందు కొంత భాగం జరిగింది. స్టార్ హీరోలు మంచు మనోజ్, దుల్కర్ సల్మాన్ లీడ్ రోల్స్ లో నటిస్తున్న ఈ మూవీ కొత్త షెడ్యూల్ త్వరలో మొదలవుతుంది. ఇప్పుడు ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పలు వార్తలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. ప్రస్తుతం ఈ సినిమా స్టోరీలో కొన్ని మార్పులు చేస్తున్నారట మేకర్స్. స్క్రిప్ట్ లో చాలా భాగం మార్చుతున్నారట. హనుమాన్ మూవీతో తేజ సజ్జాకు వచ్చిన క్రేజ్ ను దృష్టిలో పెట్టుకుని మేకర్స్ ఈ నిర్ణయం తీసుకున్నారట. గోవాలో మిరాయ్ టోటల్ స్క్రిప్ట్ కు మరమ్మతులు చేస్తున్నారట. కొత్తగా భారీ యాక్షన్ సీక్వెన్స్ ను యాడ్ చేస్తున్నారట. ఇప్పటికే షూట్ చేసిన సీన్లను కూడా రీషూట్ చేయనున్నారట. దీనిపై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. కానీ ఇదే జరుగుతుందని సినీ వర్గాల్లో జోరుగా వినిపిస్తోంది. మిరాయ్ మూవీలో తేజ సజ్జా సరసన ఇంకా ఎవరు నటించనున్నారో ఫిక్స్ కాలేదని తెలుస్తోంది. విలన్ గా మంచు మనోజ్ అలరించనున్నారు. మరో లీడ్ రోల్ లో దుల్కర్ సల్మాన్ సందడి చేయనున్నారు. రూ.40 కోట్ల భారీ బడ్జెట్ తో పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తుండగా.. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్నారు. ఇక ఈ మూవీ తర్వాత జై హనుమాన్ షూటింగ్ లో తేజ సజ్జా పాల్గొనున్నట్లు సమాచారం



# రిలీజై ఏడాదిన్నర దాటినా.. జపాన్‌లో ఏమాత్రం క్రేజ్ తగ్గని ‘ఆర్‌ఆర్‌ఆర్’




ప్రముఖ దర్శకుడు రాజమౌళి తెరకెక్కించిన ‘ఆర్‌ఆర్‌ఆర్’ మూవీ భారీ విజయం సాధించిన విషయం తెలిసిందే. మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్, యంగ్ టైగర్ యన్‌టీఆర్ హీరోలుగా 2022 మార్చి 24న వచ్చిన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా ఎన్నో రికార్డులు సృష్టించింది. ఏకంగా ఆస్కార్ వరకు వెళ్లింది. అక్కడ మూవీలోని ‘నాటునాటు’ పాటకు ఆస్కార్ అవార్డు కూడా దక్కింది. అయితే, తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఓ క్రేజీ న్యూస్‌ను చిత్రయూనిట్ అభిమానులతో పంచుకుంది.

2022 అక్టోబర్ 21న ఈ మూవీ జపాన్‌లో గ్రాండ్‌గా విడుదలయింది. 44 నగరాల్లో 209 థియేటర్లు, 31 ఐమాక్స్ తెరలపై దీనిని ప్రదర్శించారు. 34 రోజుల్లోనే అత్యధిక కలెక్షన్లు రాబట్టి 300 మిలియన్ జపాన్ యెన్‌ల క్లబ్‌లో చేరింది. భారత కరెన్సీలో దాదాపు రూ.18 కోట్లు. దీంతో ఈ క్లబ్‌లో అత్యంత వేగంగా చేరిన తొలి భారతీయ చిత్రంగా రికార్డుకెక్కింది. ఇక జపాన్‌లో ఈ చిత్రం రిలీజై ఏడాదిన్నర దాటినా అక్కడ ఈ మూవీ క్రేజ్ ఇప్పటికీ ఏమాత్రం తగ్గలేదు. ఇప్పటికీ అక్కడి సినిమా థియేటర్ల ముందు హౌస్‌ఫుల్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. ఈ విషయాన్ని తెలుపుతూ ‘ఆర్‌ఆర్‌ఆర్’ తన అధికారిక సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టింది. మార్చి 18న సినిమాను వీక్షించేందుకు డైరెక్టర్ రాజమౌళి జపాన్ వెళుతున్నారు. ఈ విషయం తెలియడంతో అక్కడి ప్రేక్షకులు ఆయనతో కలిసి మూవీని చూసేందుకు ఆసక్తిగా ఉన్నారట. దీంతో వేలాది మంది టికెట్లు కొనుగోలు చేసేందుకు యత్నించారు. ఫలితంగా బుధవారం రాత్రి టికెట్స్ బుకింగ్ ఓపెన్ చేయగా.. ఒక్క నిమిషంలోనే హౌస్‌ఫుల్ అయింది. దీనిపై నెటిజన్లు ఆసక్తికర కామెంట్లు చేస్తున్నారు.

# హీరో వెంకటేశ్ ఇంట్లో పెళ్లి సందడి!



టాలీవుడ్ స్టార్ హీరో వెంకటేశ్ ఇంట్లో పెళ్లి బాజాలు మోగనున్నాయి. వెంకటేశ్ రెండో కూతురు హయవాహిని పెళ్లి జరగబోతోంది. హైదరాబాద్ రామానాయుడు స్టూడియోస్ లో పెళ్లి వేడుక జరగనుంది. హయవాహిని ఎంగేజ్మెంట్ గత ఏడాది అక్టోబర్ లో చాలా సింపుల్ గా జరిగింది. ఆ వేడుకకు చిరంజీవి, మహేశ్ బాబు హాజరయ్యారు. ఇప్పుడు పెళ్లి కూడా ఎలాంటి హంగు, ఆర్భాటాలు లేకుండా చేయబోతున్నట్టు తెలుస్తోంది. రేపే హయవాహిని పెళ్లి జరగనుంది. విజయవాడకు చెందిన ఓ డాక్టర్ తో పెళ్లి జరగనుంది. ఈ పెళ్లికి కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరవుతున్నట్టు సమాచారం. పెళ్లి ఫొటోలు బయటకు వస్తేనే... పెళ్లికి ఎవరెవరు హాజరయ్యారనే విషయంలో క్లారిటీ వస్తుంది. వెంకటేశ్ కు ముగ్గురు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. పెద్దమ్మాయి అశ్రితకు 2019లో పెళ్లి జరిగింది.

# బ్లేజర్‌లో జూనియర్ కత్రిన



కత్రిన కైఫ్ సోదరి ఇసబెల్లా కైఫ్ పరిచయం అవసరం లేదు. ఈ బ్యూటీ బాలీవుడ్ లో పెద్ద స్టార్ అవ్వాలని కలలు గంటోంది. వరుస చిత్రాల్లో నటిస్తోంది. మరోవైపు వరుస ఫోటోషూట్లతోను హీట్ పెంచుతూనే ఉంది. తాజాగా బ్లూ బ్లేజర్ లో ఇసబెల్లా మెరుపులు మెరిపించింది. బ్లేజర్ లో ఇన్నర్ సొగసును ఆవిష్కరించేందుకు ఇసబెల్లా ఎంతమాత్రం వెనకాడలేదు. ఈ స్టన్నింగ్ ఫోటోషూట్ కోసం డబు రత్నానీ లాంటి ట్యాలెంటెడ్ ఫోటోగ్రాఫర్ పని చేయడం ఆసక్తిని కలిగిస్తోంది. ఇప్పటికే మూడు నాలుగు చిత్రాల్లో నటించేసిన ఇసబెల్లా కైఫ్ తన వర్క్ లైఫ్ అనుభవాల గురించి ఇటీవల మాట్లాడింది. తనకు తన సోదరి కత్రిన రంగుల ప్రపంచంలో ఎలా ముందుకు సాగాలో మార్గనిర్ధేశనం చేసారని వెల్లడించింది. అందరినీ మెప్పించలేక పరధ్యానంలో పడకండి! అని తన సోదరి కత్రిన కైఫ్ సలహా ఇచ్చిందని కూడా ఇసబెల్లా కైఫ్ అన్నారు. టైమ్ టు డ్యాన్స్‌తో ఇటీవలే బాలీవుడ్‌లో తన నటనా రంగ ప్రవేశం చేసిన కొత్త నటి ఇసాబెల్లె కైఫ్. తన సోదరి, సీనియర్ నటి కత్రినా కైఫ్ కష్టపడి పని చేయమని..చేసే పనిపై దృష్టి కేంద్రీకరించమని సలహా ఇచ్చిందని చెప్పింది. దర్శకనిర్మాత-కొరియోగ్రాఫర్ రెమో డిసౌజా వద్ద సీనియర్ సహాయకుడు స్టాన్లీ మెనినో డికోస్టా ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఈజ్ కింగ్, పార్టనర్, ఏక్ థా టైగర్ వంటి చిత్రాల సెట్స్‌లో కత్రినా కైఫ్‌ను కలిసేదానిని అని దానివల్లనే హిందీ చిత్ర పరిశ్రమ ఎలా పనిచేస్తుందనే దానిపై అవగాహన వచ్చిందని ఇసాబెల్లె కైఫ్ చెప్పారు.

కత్రిన ఎప్పుడూ చాలా సపోర్టివ్‌గా ఉంటుంది. మనం వ్యక్తుల గురించి తెలుసుకున్నప్పుడు అది ఎల్లప్పుడూ సహాయపడుతుంది. ప్రతి ఒక్కరినీ మెప్పించలేము గనుక ఎప్పుడూ ఏకాగ్రతతో ఉండాలి.. కష్టపడి పనిచేయాలి..సందర్భం ఏదైనా కానీ పరధ్యానంలో పడకండి! అని కత్రిన సలహా ఇచ్చినట్టు ఇసబెల్లా తెలిపారు. నేను ఏం చేయబోతున్నాను అనే దాని గురించి నాకు ఒక ఐడియా వచ్చింది. నాకు పరిశ్రమలోకి రావాలనే కోరిక ఉంది.. కానీ నేను నా పాఠశాల విద్యను ముగించవలసి వచ్చింది. తరువాత నేను కాలేజీకి వెళ్లి, ఆపై నటనలోకి వచ్చాను అని తెలిపింది. బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ సినిమాల్లో ఇసాబెల్లె కైఫ్ నటనారంగేట్రం చేస్తుందని చాలా కథనాలొచ్చాయి. అయితే ఆడిషన్ క్లియర్ అయిన తర్వాత ఒక డ్యాన్స్ డ్రామాలో పాత్రను పోషించే అవకాశం వరించిందని ఇసబెల్లా చెప్పారు. నేను సినిమా కోసం ఆడిషన్ ఇచ్చాను. నిర్మాతలు నన్ను ఇష్టపడిన తర్వాత ఎంపికయ్యాను అని తెలిపింది. పరిశ్రమలో నటించడానికి ప్రయత్నించే ఎవరికైనా ఖాన్ ఎల్లప్పుడూ మద్దతుగా ఉంటారని అంది. నేను కొన్నాళ్లుగా సినిమాల కోసం ఆడిషన్ ఇస్తున్నాను. ఈసారి ప్రతిదీ సరిగ్గా జరిగింది. ఆడిషన్స్ ఎంత ఎక్కువ చేస్తే అంత మంచిది! అని ఇసబెల్లా చెప్పింది. బాలీవుడ్‌లోకి ప్రవేశించే ముందు తాను యుఎస్‌లో జూనియర్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఒక సినిమా సెట్‌లో పనిచేశానని వెల్లడించింది. అమెరికాలోని యాక్టింగ్ స్కూల్ నుంచి చదువు ముగించుకుని సినిమాల్లో చేరేందుకు ఇండియా వచ్చాను అని కూడా తెలిపింది. కెమెరా వెనుక పని చేయడం వల్ల సినిమా మేకింగ్ ప్రక్రియను అర్థం చేసుకోవచ్చు. సుదీర్ఘ గంటలు షూట్ చేయడం, షాట్ సెటప్ చేయడం, సినిమా కోసం ప్రిపరేషన్ చేయడం సెట్ లైఫ్ ఎలా ఉంటుందో మీరు అనుభూతి చెందుతారు.. అని తెలిపింది. ‘టైమ్ టు డ్యాన్స్’ తర్వాత ‘సుస్వాగతం ఖుషామదీద్’ అనే చిత్రంలోను ఇసబెల్లా నటించింది. ఇందులో పుక్రే స్టార్ పుల్కిత్ సామ్రాట్ కథానాయకుడిగా నటించారు.